# భారత రాజ్యాంగాన్ని మించిన రాజ్యాంగం మరో దేశానికి లేదు

- ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి
- జాతీయ 16వ ఓటర్ దినోత్సవం
- సందర్భంగా ఆరివో కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా ర్యాలీ
- భారత రాజ్యాంగంలో.. ఓటు హక్కు విలువైనది
- విద్యార్థులచే ఓటు హక్కుపై ప్రతిజ్ఞ




**దశ, ఇబ్రహీంపట్నం:** భారత రాజ్యాంగాన్ని మించిన రాజ్యాంగం మరో దేశానికి లేదని, రాజ్యాంగంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని ఇబ్రహీంపట్నం ఆర్డీవో కే. అనంతరెడ్డి తెలిపారు. 16వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నంలో ఆర్డీవో కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో భారత రాజ్యాంగం ఓటు హక్కు పై విద్యార్థులకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆర్డీవో అనంతరెడ్డి మాట్లాడుతూ.. ఇతర దేశాలతో పోలిస్తే భారత రాజ్యాంగం ఎంతో ప్రజాస్వామ్య యుతంగా పనిచేస్తుందని తెలిపారు. భారత రాజ్యాంగం ద్వారా ఎన్నికైన ప్రభుత్వం రెండు మూడు రోజుల్లోనే అధికారం చేపడుతోందని గుర్తు చేశారు. అలాగే ఇతర దేశాల్లో ఎన్నికలు పూర్తయి ఇప్పటికీ 600 రోజులు దాటిన ప్రభుత్వం అధికారాన్ని చేపట్టే లేదని తెలిపారు. అందుకు ప్రెసిడెంట్ పాలనే కారణమని గుర్తు చేశారు. కానీ భారతదేశంలో 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు ద్వారా ప్రభుత్వాని ఎన్నిక చేసుకొని వెంటనే అధికారం చేపడుతోందని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని మించిన రాజ్యాంగం మరో దేశానికి లేదని గుర్తు చేశారు. ఈ తరుణంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినిగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటును దుర్వినియోగం చేయొద్దన్నారు. విద్యార్థులు, మేధావులు ఓటు హక్కు వినియోగించకపోవడం వలన నిజమైన నాయకుడు ఎన్నిక కాకుండా పోతాడని ఇది భారత రాజ్యాంగానికి ప్రమాదం అని గుర్తు చేశారు. ఓటు హక్కు ప్రాధాన్యత, 18ఏళ్లు నిండిన వారంతా ఓటర్లుగా నమోదు కావడం, ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం ఎంతో అవసరం అన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, మున్సిపల్, సాధారణ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లోను యువతనే కీలకపాత్ర వశించాలని తెలిపారు. ఓటు హక్కు నమోదు చేసుకోవడం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని తెలిపారు. ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే బిఎల్వోల ఆధ్వర్యంలో విచారణ చేసి ఓటు హక్కు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మంచాల, యాచారం తహసిల్దార్లు సునీతా రెడ్డి, ప్రసాద్ రావు, అయ్యప్ప, డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాస్ గౌడ్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ నర్సింహా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆర్కే హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**దశ, ఓయూ :** శ్రీ ఆర్కే హాస్పిటల్ చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం సంగెం గ్రామంలో నిర్వహించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నందు గ్రామ ప్రజలకు బిపి, షుగర్, న్యూరోపతి, బిఎండి పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం నందు గ్రామ ప్రజలకు డాక్టర్ బీపీ షుగర్ థైరాయిడ్ మొదలగు దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన లక్షణాలు మరియు వాటి నివారణకు తీసుకొని వలసిన తగు జాగ్రత్తలను గురించి వివరించారు. ఈ ఉచిత వైద్య శిబిరం నందు గ్రామ సర్పంచ్ తాడూరి లలిత లింగస్వామి, ఉప సర్పంచ్ పొట్ట శ్రీను హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి విచ్చేసి గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరం నందు 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు గ్రామ సర్పంచ్ తెలియజేశారు.

## అరుంధతి యువజన సంఘం అధ్యక్షుడిగా చింతకుంట్ల పరమేష్



**దశ,తుంగతుర్తి:** తుంగతుర్తి మండలంగొట్టిపర్తి గ్రామంలోని అరుంధతి యువజన సంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నికోవడం జరిగింది. ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడు చింతకుంట్ల పరమేష్ ను (DL) ఎన్నుకోవడం జరిగింది.ఉపాధ్యక్షుడిగా మందుల కృష్ణ, కార్యదర్శి చింతకుంట్ల సైదులు ,ప్రధాన కార్యదర్శి మాచర్ల ఉపేందర్ ,కోశాధికారి చింతకుంట్ల సతీష్ ,సాంస్కృతిక కార్యదర్శి అందే పరశురాం, గౌరవ అధ్యక్షులు పాశం అవిలయ్య, సలహాదారులు చింతకుంట్ల బాబు, గాడి పెల్లి శ్రీను ,చింతకుంట్ల సురేష్ ,మందుల మల్లేష్ ,చింతకుంట్ల రాజు చింతకుంట్ల సైదులు , ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు చింతకుంట్ల పరమేష్ మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని, గ్రామ అభివృద్ధి కోసం అరుంధతి యువజన సంఘం ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుంధతి యువజన నాయకులు,తదితరులు పాల్గొన్నారు

## 100 ఫీట్ల బ్రిడ్జ్ నిర్మాణం చేయాలి

- చెరుకుపల్లి మైకేల్ రాజు.



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** పిల్లలమర్రిలో మూసి కాలువపై 100 ఫీట్ల బ్రిడ్జి ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త చెరుకుపల్లి మైకేల్ రాజు డిమాండ్ చేశారు. ఆదివారం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులను బ్రిడ్జి పొడవు పెంచాలని కోరారు. గ్రామానికి ప్రధానంగా వెళ్లే బ్రిడ్జి కూలిపోయి ఐదు నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కలెక్టరేట్, ఇరిగేషన్, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరిగానని చెప్పారు. చిన్న బ్రిడ్జి ఏర్పాటుతో గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని 100 ఫీట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## సమాజ సేవే లక్ష్యంగా శ్రీ వాసవి సేవాసమితి సేవలు



**దశ సూర్యాపేట ప్రతినిధి :** సమాజ సేవే లక్ష్యంగా శ్రీ వాసవి సేవా సమితి సేవలు అందిస్తుందని శ్రీ వాసవి సేవాసమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పూరి సురేష్ శెట్టి తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కిరాణా ఫ్యాన్స్ బిల్డింగ్ లో శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాల క్రితం శ్రీ వాసవి సేవా సమితి స్థాపించి ఉమ్మడి రాష్ట్రాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ముఖ్యంగా అట్టడుగు వర్గాలలో ఉన్న ఆర్యవైశ్యులకు విద్య, వైద్యంకు సహకారం అందిస్తుందని తెలిపారు. శ్రీ వాసవి సేవాసమితిలో సభ్యత్వం తీసుకున్న వారికి రెండు సంవత్సరాల పాటు కార్పొరేట్ హాస్పిటల్లో రాయితీ కనిపిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఐదుగురు పేద ఆర్యవైశ్యులకు మందులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా గౌరవ చైర్మన్ గా ఈగ దయాకర్ గుప్త,గౌరవ సలహాదారులుగా గోపారపు రాజు, అధ్యక్షులుగా బచ్చు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా దేవరశెట్టి నాగరాజు, కోశాధికారిగా సోమా ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి లు, సబ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర కార్యదర్శి బానూరు నాగేంద్రం, ప్రవీణ్, కళ్యాణ్, చల్లా ప్రకాష్, మారం గోవింద్, రాఘవేంద్ర, బిక్కుమల్ల ఉపేందర్,నూక వెంకటేశం గుప్త తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, MLA పద్మావతీ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ దిష్టి బొమ్మ దగ్ధం

**దశ సూర్యాపేట ప్రతినిధి :** దళిత యువకుడు రాజేష్ మరణంపై నేడు కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేస్తున్న వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి అన్నారు. కర్ల రాజేష్ కు ఈ పరిస్థితికి రావడానికి కారణమైన అసలు ముఠా ఎవరో కోదాడ ప్రజలకు బాగా తెలుసన్నారు. పేదల నిధులకు కన్నం వేసింది గత BRS ప్రభుత్వమని, ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా పేదలకు అందాల్సిన చెక్కులను లబ్ధిదారులకు ఇవ్వకుండా, అదే పేరుతో ఉన్న మీ అనుచరుల ఖాతాలకు మళ్లించి కోట్లాది రూపాయలు డ్రా చేసుకున్న ఘోరమైన స్కామ్ జరిగింది మీ బీఆర్ఎస్ హయాంలోనే కాదా అని ప్రశ్నించారు. ఈ CMRF స్కామ్ లో అసలు సూత్రధారులను కాపాడటానికి, సామాన్యులను బలిపశువులను చేసింది మీ పార్టీ నాయకులు కాదా అని అన్నారు. అప్పుడు అధికారంలో ఉండి అక్రమాలకు అండగా నిలిచి, ఇప్పుడు నీతులు మాట్లాడటం మీ విజ్ఞతకే వవదిలేస్తున్నామన్నారు. నేడు అధికారం పోగానే దళిత ప్రేమ వలకబోయడం శవ రాజకీయాలు చేయడమే మీ తీరు అని దుయ్యబట్టారు. మంత్రి ఉత్తమ్, MLA పద్మావతీ లపై విమర్శలు హాస్యాస్పదం అని అన్నారు. అవినీతి రహిత పాలన అందిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిని విమర్శించే ముందు మీ హయాంలో జరిగిన దోపిడీకి మాజీ MLA బొల్లం మల్లయ్య సమాధానం చెప్పాలన్నారు. 40 ఎండ్లుగా రాజకీయంలో ఉండి అవినీతి మచ్చలేని నాయకులు ఉత్తమ్ పద్మావతీ రెడ్డి లను విమర్శించే అర్హత మీకు లేదని, మల్లయ్య యాదవ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ముధిరెడ్డి మధుసూధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పందిల్లపల్లి పుల్లారావు, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ మైనంపాటి గురువారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెలుగు వీరన్న, Sc సెల్ మండల అధ్యక్షులు కొరిపెళ్ళి విక్రమ్, సోషల్ మీడియా మండల అధ్యక్షులు అర్వపల్లి గణేష్, మరియు వివిధ గ్రామాలు గ్రామశాఖ అధ్యక్షులు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు, మజి సర్పంచ్ లు వార్డు మెంబర్లు, మండల, గ్రామాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నరు.

## ఆర్టీస్టులు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలి

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** ఆర్జిస్టులు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవడంతో పాటు సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు శనగాని రాంబాబుగౌడ్, సీనియర్ ఆర్టిస్టులు ఖదీర్, మన్సూర్, వాసులు అన్నారు. ఆదివారం స్థానిక ఎంజడ్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సూర్యాపేట పట్టణ ఆర్టిస్టు అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.అనంతరం ఆర్టిస్ట్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులుగా గోవర్ధన్ ఆర్ట్స్, ఉపాధ్యక్షులుగా నవ్య ఆర్ట్, భాను ఆర్ట్స్, శేఖర్ ఆర్ట్స్, హమ్మద్ ఆర్ట్స్, ప్రధాన కార్యదర్శిగా భవాని ఆర్ట్స్, ప్రచార కార్యదర్శిగా ఉప్పి ఆర్ట్స్, నరేష్ ఆర్ట్స్, కోశాధికారిగా మనో ఆర్ట్స్, సంయుక్త కార్యదర్శిగా అనీష్ ఆర్ట్స్, కార్యవర్గ సభ్యులుగా జయక్రిష్ణ, రవి, హరి, ప్రసాద్, శ్రీను, నందు, నజీర్, బాలాజీలు ప్రమాణస్వీకారం చేశారు. అంతకు



ముందు ఇటీవల మరణించిన ఆర్జిస్టులకు నివాళులర్పించారు. సత్యం ఆర్ట్స్, పవన్ ఆర్ట్స్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సాజిత్ ఖాన్, మద్ది శ్రీనివాస్, మధు, సీనియర్ ఆర్టిస్టులు వాసు, రాజా, రాజు, చైతన్య, పవన్, బారిశెట్టి శ్రీను, చిన్న శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

**దశ సూర్యాపేట ప్రతినిధి :** ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూర్యాపేట డీఎంహెచ్ఓగా డాక్టర్ పెండెం వెంకటరమణ, ఐఎంఏ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ లు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో వినూత్న హాస్పిటల్ లో గుండె సంబంధిత వైద్య సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రస్తుత సమాజంలో చాలామంది బిజీ అయిపోయి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడం లేదని అన్నారు. ఫలితంగా తక్కువ వయసులో గుండె జబ్బుల బారిన పడుతున్నారని అన్నారు. గుండెపోటు వస్తే వంద మందిలో 50 మంది హాస్పటల్ కు చేరుకునే లోపే చనిపోతున్నారని అన్నారు. ఎక్కడో హైదరాబాద్, విజయవాడ, ఖమ్మం వంటి మహా నగరాలకు వెళ్లకుండా మన సూర్యాపేటలో వినూత్న హాస్పిటల్ లో గుండెకు సంబంధించిన చికిత్సలను అందించడం అభినందనీయమని అన్నారు. సూర్యాపేట ను



ఆరోగ్యవంతమైన సూర్యాపేట గా మార్చాలని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ట్రస్ట్ ప్రెసిడెంట్ ఆనంద్ ధండ్గే, సెక్రటరీ ఎల్ రమేష్, డాక్టర్ ఉదయ్, డాక్టర్ మీలా సందీప్, డాక్టర్ వరప్రసాద్, మేనేజ్మెంట్ మల్లారెడ్డి, కమలాకర్, రాజు, వేణుమాధవ్, నగేష్, మధుకర్, నవీన్, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రథసప్తమి శోభాయాత్ర



దశ, సూర్యాపేట ప్రతినిధి : జిల్లా కేంద్రంలోని వేదాంత భజన మందిరం సీతారామచంద్రస్వామి దేవాలయంలో రథసప్తమి శోభ యాత్రను పురస్కరించుకొని ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు ధరూరి సింగరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ఆరాధన, భక్తులచే సామూహికంగా ఆదిత్య హృదయం పారాయణం స్వామివారికి అష్టోత్తర శతనామార్చన స్వామి వారికి, సూర్య నారాయణ స్వామి వారికి మహా నివేధన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై స్వామివారి శోభాయాత్ర పట్టణంలో కోలాట ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు రాచూరి వెంకటేశ్వలు, కార్యదర్శి నకిరేకంటి రాజశేఖర్ కోశాధికారి సోమ అశోక్ గడ్డం వెంకన్న, గండూరి రమేష్, దంతాల సందీప్, అంతటి దినేష్, షీలా శంకర్, చిత్తలూరు శ్రీధర్, కక్కిరేణి విజయ్ కుమార్, సోమ సుమన్, వెంకన్న, ఓరుగంటి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని మున్సిపాలిటీలో బిజెపి జెండా ఎగరాలి: కిషన్ రెడ్డి

- అన్ని వార్డుల్లో అభ్యర్థులను నిలబెట్టండి
- గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



దశ భద్రాద్రి కొత్తగూడెం: త్వరలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కొత్తగూడెం కార్పొరేషన్ పై బిజెపి జెండా ఎగరాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తగూడెం క్లబ్లో మున్సిపల్ ఎన్నికల విజయ సంకల్ప సభ బిజెపి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభకు కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ పీఠం దక్కించుకోవడంతోపాటు ఇల్లెందు, అశ్వరావుపేటలో సైతం వార్డ్ మెంబర్లను మున్సిపల్ చైర్పర్సన్ లను గెల్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగూడెంకు తొలిసారిగా జరుగుతున్న మున్సిపాలిటీ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి సత్తా చాటాలన్నారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. లబ్ధిదారులకు ఏ పథకాలు కేంద్ర నుంచి వచ్చాయి అనేది నిశితంగా పరిశీలించాలని అన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత పదేళ్ల కాలం టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకుందన్నారు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల కాలంలో తన వంతు దోపిడీ చేస్తుందన్నారు. గడచిన 12 సంవత్సరాల కాలంలో టిఆర్ఎస్ కాంగ్రెస్ రెండు ప్రభుత్వాలు ప్రజల సంపదను లూటీ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విధానాల వల్ల తెలంగాణ ఆగమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వచ్చే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తిచేశారు.

### సంక్షోభంలో సింగరేణి...

సింగరేణి కాలరీస్ కంపెనీ సంక్షోభంలో పూర్తిగా కూరుకుపోయిందని దీనికి కారణం ప్రధానంగా బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వాలేనని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణికి రావాల్సిన దాదాపుగా 51 వేల కోట్ల బకాయిలు గత ప్రభుత్వం ఈ ప్రభుత్వం ఒక పైసా కూడా చెల్లించలేదన్నారు. బకాయిలు చెల్లించనందున సింగరేణి నష్టాల్లో నడుస్తుందన్నారు. సింగరేణికి వచ్చిన సొమ్మును ఆ రెండు పార్టీలు ఏటీఎం లాగా వాడుకుంటున్నాయని అసహనం వ్యక్తం చేశారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం 35 వేల కోట్ల రూపాయల అప్పు చేసి పోయిందన్నారు. సింగరేణిలో కొత్త మిషనరీ రక్షణకు సంబంధించిన ఎలాంటి చర్యలు చేపట్టలేదని కాంగ్రెస్ బీఆర్ఎస్ లను విమర్శించారు. సింగరేణి అభివృద్ధి కొరకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులకు రూ. 30 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలి

- సింగరేణి క్వార్టర్లను మాజీ కార్మికులకే కేటాయించాలి
- ఇల్లందు గెస్ట్ హౌస్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో భేటీ అయిన ఎమ్మెల్యే కూనంనేని



దశ, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కార్మికులకు రూ. 30 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వడంతో పాటు సింగరేణి క్వార్టర్లను మాజీ కార్మికులకే కేటాయించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. మంత్రి కిషన్ రెడ్డి కొత్తగూడెం పర్యటన సందర్భంగా ఇల్లందు గెస్ట్ హౌస్‌లో కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆయనను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ మనుగడ, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలతో కూడిన మెమోరాండంను మంత్రికి అందజేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడిన కూనంనేని సింగరేణి ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెంచేందుకు పెనగడప, పూనుకుడుచెలక, రాంపూర్, గుండాలలో తక్షణమే కొత్త భూగర్భ బొగ్గు గనులను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.

కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు రూ.30 లక్షల వడ్డీ లేని గృహ రుణాలను అందించాలని అలాగే పదవీ విరమణ చేసిన వారికి కనీస పెన్షన్ రూ.10 వేలకు తగ్గకుండా చూడాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పాత సింగరేణి క్వార్టర్లను కూల్చివేయకుండా, ప్రస్తుతం నివసిస్తున్న మాజీ కార్మికులకే వాటిని కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు కార్మికుల కార్పొరేట్ మెడికల్ బోర్డును ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్విరామంగా కొనసాగించాలని కోరారు. సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపిస్తూనే, కార్మికుల న్యాయమైన హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని కూనంనేని స్పష్టం చేశారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించాలని మంత్రికి విన్నవించినట్లు ఆయన పేర్కొన్నారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, నాయకులు నెరేళ్ల రమేష్, పి.సత్యనారాయణచారి తదితరులు వున్నారు.

# బావాబామ్మర్దులు ఇసుక అమ్ముకుని వేలకోట్లు దోచుకున్రు

- హరీష్ రావ్, కేటీఆర్లపై మైనంపల్లి హన్మంతరావ్ ధ్వజం



దశ, మెదక్: బావాబామ్మర్దులు అక్రమంగా ఇసుక అమ్ముకుని వేలకోట్లు దోచుకున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్ ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మెదక్ పట్టణానికి చెందిన మెదక్ సొసైటీ మాజీ చైర్మెన్, మాజీ కౌన్సిలర్చింతల నర్సింలు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ ఉప్పల కిష్టయ్య, మాజీ కౌన్సిలర్ మాడిశెట్టి అంజయ్య తమ అనుచరులతో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాయ గార్డెన్ నుంచి వెంకటేశ్వర గార్డెన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో మైనంపల్లి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాములో అప్పుడు మంత్రిగా ఉన్న హరీష్ రావ్ హవేలి ఘనపూర్ మండలం సర్ధన వద్ద మంజీరా నది నుంచి, కొల్చారం మండలం కొంగోడ్ వద్ద హల్దీ వాగు నుంచి అక్రమంగా పెద్ద ఎత్తున ఇసుక తరలించి అమ్ముకున్నారని ఆరోపించారు. ఇసుక దొంగతనం ఎవరు చేశారో మెదక్ ప్రజలకు తెలియదా అని ప్రశ్నించారు. ఆయనకు వేల కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయన్నారు. హరీష్‌రావ్ మెదక్ జిల్లాలో ఇసుక అమ్ముకుంటే, ఆయన బావ మరిది కేటీఆర్ సిరిసిల్ల జిల్లాలో నుంచి పెద్ద మొత్తంలో ఇసుక తరలించి అమ్ముకున్నారని ధ్వజమెత్తారు. అక్కడి దళితులు అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటే వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగింపజేశారని, దాంతో సంసారానికి పనికి రాకుండా అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. హరీష్ మెదక్ వచ్చి ఎంతో అభివృద్ధి చేశామని చెప్పడాన్ని హన్మంతరావ్ తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాములో మెదక్ నుంచి అనేక ప్రభుత్వ కార్యాలయాలను సిద్దిపేట తరలించారని, వాటన్నింటిని మళ్లీ మెదక్ తీసుకొస్తేనే ఆయనకు గౌరవిస్తామని, లేకుంటే ఇక్కడ తిరగకుండా అడ్డుకునే పరిస్థితి ఉంటుందన్నారు. హరీష్ రావ్ వెంట ఉన్న వారు కుంబకోణాలకు పాల్పడ్డారని హన్మంతరావ్ ధ్వజమెత్తారు. ఒకాయన సొసైటీని దోచుకున్నారని పరోక్షంగా మాజీ ఎమ్మెల్యే పద్మా రెడ్డి భర్త దేవేందర్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారాన్ని ఉపయోగించి అతనిపై యాక్షన్ లేకుండా అందరిని మ్యానేజ్ చేశారన్నారు. అన్ని కుంబకోణాలు బయట పెడతామని, క్యారెక్టర్ లేని వారి భాగోతాలు బయటకు తీస్తామన్నారు. కొన్ని నెలల కిందట భారీ వరదలు వచ్చి విపరీతమైన నష్టం జరిగినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ వచ్చి పంట నష్టం పై రివ్యూ చేశారని గుర్తు చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా వరదలు వచ్చినప్పుడు ఇలా స్పందించలేదన్నారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావ్, తాను కూడా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు సహాయకార్యక్రమాల్లో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. మెదక్ అభివృద్ధి విషయంలో ఎట్టి పరిస్థితిలో వెనుకకు పోమని, రోహిత్ రావ్ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మెదక్ నియోజకవర్గానికి దాదాపు రూ.200 కోట్లు తెచ్చి అభివృద్ధి చేస్తున్నారన్నారు. మెదక్ చర్చి వద్ద అభివృద్ధి పనులకు రూ.29.34 కోట్లు, ఏడుపాయల అభివృద్ధి పనులకు రూ.35 కోట్లు, మెదక్ పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.80 కోట్లు మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్, కోదండరామస్వామి సేవాసమితిల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

దశ, సూర్యాపేట ప్రతినిధి : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మునగాల మండలం నరసింహపురం గ్రామ సర్పంచ్ వేమూరి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట జిల్లా మునగాల మండలం నరసింహపురం గ్రామంలో స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్, కోదండరామస్వామి సేవాసమితి ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి ఉచిత కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపడుతామని స్వచ్ఛంద సంస్థల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. వేలాది రూపాయలు వెచ్చించి ఆస్పత్రులకు వెళ్లకుండా గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేస్తున్న లయన్స్ క్లబ్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కంటి వైద్యులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 'పిల్లల అభివృద్ధి కొరకు కృషి చేస్తా'

- సర్పంచ్ దున్న శ్రీనివాస్




దశ నడిగూడెం : గ్రామంలో పిల్లల విద్యపై అవగాహన కల్పిస్తూ ఆసక్తిని పెంచుతూ వారి అభివృద్ధి కొరకు కృషి చేస్తానని స్థానిక సర్పంచ్ దున్న శ్రీనివాస్ అన్నారు. ఇటీవల స్థానిక ఎన్నికలలో సర్పంచిగా ఎన్నికైన నడిగూడెం గ్రామ నివాసి దున్న శ్రీనివాస్ ను సన్మానించేందుకు గతంలో తనతో పాటు బాలల హక్కుల పరిరక్షణకై పని చేసినటువంటి సహచర మిత్రులందరూ కూడా ఆయనను సన్మానించేందుకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా తనతో కలిసి పని చేసినటువంటి సహచర మిత్రులందరికీ సమక్షంలో కేక్ కట్ చేసి పూలమాలలు శాలువలతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నిరంతరం పిల్లల కోసం పని చేసినటువంటి ఆలోచన కలిగి ఉన్న వారు కాబట్టి ప్రతి గ్రామంలో కూడా పిల్లల గురించి చర్చించాలని వారి అవసరాలకు కొంత బడ్జెట్ను కూడా కేటాయించే విధంగా గ్రామ సర్పంచులు చొరవ తీసుకొని వారి అభివృద్ధికై విషయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎల్.పి రామయ్య మొలుగూరి గోపి నూకపంగు ఈదయ్య కంభంపాటి శ్రీనివాస్ నోసిన కోటయ్య కాంపాటి శ్రీనివాస్ బుర్ర సైదులు నూకపంగు వెంకటేశ్వర్లు కేతేపల్లి శ్రీను బాణాల అబ్రహం వీరబాబు గురవయ్య గోపి శ్రీను నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ పార్కింగ్, డెంటింగ్ షాపుల తొలగింపుకు డిప్యూటీ మేయర్ ఆదేశాలు



దశ, ఓయూ: ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడ డివిజన్ పరిధిలోని మోతిలాల్ నెహ్రూ నగర్, మారుతి నగర్ బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ఆదివారం కవాడిగూడ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచన శ్రీ, జీహెచ్ఎంసీ కవాడిగూడ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ పుష్పలతతో కలిసి గోశాల నుంచి గాంధీనగర్ న్యూ బ్రిడ్జి వరకు ఉన్న రహదారి పరిస్థితులను డిప్యూటీ మేయర్ పరిశీలించారు. రహదారి పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన డెంటింగ్-పెయింటింగ్ షాపులు, వాహనాల పార్కింగ్ కారణంగా రాకపోకలు పూర్తిగా అడ్డంకులకు గురవుతున్నాయని, దీంతో మోతిలాల్ నెహ్రూ నగర్ మరియు మారుతి నగర్ బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ప్రత్యేకించి రాత్రివేళ ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, మహిళలు, వృద్ధులు, పిల్లలు భయాందోళనలతో ప్రయాణించాల్సి వస్తోందని బస్తీ వాసులు విన్నవించారు. దీనిపై స్పందించిన డిప్యూటీ మేయర్ గాంధీనగర్ ట్రాఫిక్ అధికారులను వెంటనే అప్రమత్తం చేసి, అక్రమ పార్కింగ్‌ను తొలగించడంతో పాటు రహదారి విస్తరణ పనులు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే మోతిలాల్ నెహ్రూ నగర్ బస్తీ మధ్యలో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న డెంటింగ్-పెయింటింగ్ దుకాణాల వల్ల ప్రజారోగ్యం, చిన్నారుల భద్రతకు ముప్పు ఏర్పడుతోందని పేర్కొంటూ, వాటిని తొలగించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వీధి దీపాల మరమ్మతులు, ఆసుపత్రి ఎదుట అడ్డంగా నిలిపిన వాహనాల తొలగింపు, కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన అంశాలు సహా ఇతర బస్తీ సమస్యలపై కూడా ఆమె సమగ్రంగా సమీక్షించారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని డిప్యూటీ మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మోతిలాల్ నెహ్రూ నగర్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మారుతి నగర్ కమిటీ ప్రతినిధులు, స్థానిక బస్తీ వాసులు, జీహెచ్ఎంసీ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.